క్లుప్తంగా

పోలీస్ శాఖపై నమ్మకం పెంచాలి


ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఐ నారాయణరెడ్డి

పుట్టపర్తి టౌన్: సమర్థవంతంగా పనిచేసి ప్రజల్లో పోలీస్ శాఖపై నమ్మకం కలిగించాలని ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. కోవెలకుంట్ల సీఐగా పనిచేస్తూ కదిరి టౌన్ సీఐగా బదిలీ అయి బాధ్యతలు స్వీకరించిన డీవీ నారాయణరెడ్డి శనివారం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ మాధవరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

రీ సర్వేతో శాశ్వత భూహక్కు


రీ సర్వే నంబరు రాళ్లను పరిశీలిస్తున్న ఆర్డీఓ రాఘవేంద్ర

అమడగూరు: జగనన్న భూ సర్వేతో రైతులకు వారి భూములపై శాశ్వత హక్కు కలగనుందని ఆర్డీఓ రాఘవేంద్ర పేర్కొన్నారు. చీకిరేవులపల్లి పంచాయతీలో రీ సర్వే అనంతరం నాటుతున్న నంబరు రాళ్లను శనివారం ఆయన పరిశీలించారు. ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పనులు పూర్తి చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం రెవెన్యూ కార్యాలయానికి చేరుకుని రికార్డులను పరిశీలించారు. తర్వాత అమడగూరు రెవెన్యూ గ్రామ పరిధిలో ల్యాండ్ మార్పిడి కోసం వచ్చిన భూములను పరిశీలించారు. తహసీల్దార్ వెంకటరెడ్డి, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ నందిని పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు ఎమ్మెల్యే సతీమణి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి కేతిరెడ్డి సుప్రియ

ధర్మవరం రూరల్: పేద కుటుంబాలకు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సతీమణి కేతిరెడ్డి సుప్రియ అండగా నిలిచారు. అనారోగ్యంతో మృతి చెందిన ధర్మవరం పట్టణంలోని 10వ వార్డుకు చెందిన సాకే చంద్ర శేఖర్ కుటుంబానికి రూ.20వేలు శనివారం తన స్వగృహంలో ఆర్థిక సాయం చేశారు. అదే విధంగా 21వ వార్డుకు చెందిన జయమ్మ ఇంటి నిర్మాణానికి రూ.20వేలు, 34వ వార్డుకు చెందిన గాయిత్రి చదువు కోసం రూ.25వేలు అందజేశారు. అదేవిధంగా ఈనెల 18న మృతి చెందిన 9వ వార్డుకు చెందిన రమేష్ కుటుంబానికి రూ.25వేలు అందజేశారు. కౌన్సిలర్ పెనుజూరు నాగరాజు పాల్గొన్నారు.

ఈ–క్రాప్ నమోదును పక్కాగా చేపట్టాలి


ఈ–క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ సత్యనారాయణ

తనకల్లు: పంటల వివరాలను ఈ–క్రాప్ బుకింగ్‌లో పక్కాగా నమోదు చేయాలని వ్యవసాయ శాఖ ఏడీఏ సత్యనారాయణ అన్నారు. బాలసముద్రం గ్రామ సచివాలయం పరిధిలోని గ్రామాలలో శనివారం చేపట్టిన ఈ– క్రాప్ బుకింగ్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం బాలసముద్రంలో సాగు చేసిన వేరుశనగ, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. వ్యవసాయాధికారి శ్రీహరినాయక్, ఏఓఈ నయాజ్, ఆర్బీకే సిబ్బంది మహేష్, సాయిప్రీతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత


రూ.10 వేలు అందజేస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: తుమ్మల క్వార్టర్స్ వద్ద అనారోగ్యంతో బాధపడుతున్న హరిత అనే మహిళకు వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తల హరిప్రసాద్ ఆర్థిక సాయం చేశారు. రూ. 10 వేల మొత్తాన్ని తన తండ్రి మాజీ సర్పంచ్ బత్తల వెంకటరమణ చేతులమీదుగా అందజేశారు.

నేడు వాహనాల వేలం

అమడగూరు: పలు కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఆదివారం ఉదయం 11 గంటలకు స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో వేలం నిర్వహించనున్నట్లు ఎస్‌ఐ వెంకటనారాయణ తెలిపారు. 7 బైక్‌లు, 3 కార్లు, ఒక టాటాసు మోకు వేలం వేస్తామని తెలిపారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' పేదలకు వరం


ఎన్పీకుంట: వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి


వైద్య శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

• ఎమ్మెల్యే సిద్దారెడ్డి

కదిరి టౌన్: ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలకు విశేష స్పందన లభించింది. కదిరి మున్సిపల్ పరిధిలోని మూర్తిపల్లి అర్బన్ హెల్త్ సెంటర్‌లో శనివారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని కదిరి ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరం లాంటిదన్నారు. గతంలో వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకం ద్వారా లక్షలాది మందికి కార్పొరేట్ వైద్యం అందిందన్నారు. ప్రస్తుతం ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్ మరో అడుగు ముందుకు వేసి ఆరోగ్యశ్రీ పథకాన్ని పటిష్టం చేసి 3256 వ్యాధులకు వైద్య సేవలందించేలా చర్యలు తీసుకున్నారన్నారు. ఐదు దశల్లో స్క్రీనింగ్ నిర్వహించి, మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆస్పత్రులు, నెట్‌వర్క్ ఆస్పత్రులకు పంపుతారన్నారు. ప్రతి ఒక్కరూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వినియోగించుకోవాలన్నారు. పట్టణంలో రూ.3 కోట్లతో నాలుగు అర్బన్ హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. కాగా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి వేలాది మంది తరలివచ్చారు. వైద్యులు ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు అందజేశారు. మున్సిపల్ కమిషనర్ శ్రీవారి బాబు, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ సీవీ మదన్‌కుమార్, కౌన్సిలర్ గిరిజమ్మ పాల్గొన్నారు.

తలుపుల: వేపమానిపేట విలేజ్ క్లినిక్‌లో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎంపీపీ రఫీనాయక్, వైద్యాధికారులు మున్వర్‌బాషా, సల్మా, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కులశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్పీకుంట: గౌకనపేటలోని పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే సిద్దారెడ్డి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలో వైద్య సేవల కోసం ఇలాంటి సదుపాయాలు ఉండేవా..? అని ప్రశ్నించారు. చంద్రబాబునాయుడు 108, 104 వాహనాలను మరుగున పడేసిన పరిస్థితిని గుర్తు చేశారు. సీఎం జగనన్న ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. అనంతరం సుమారు 400 మందికి పైగా టోకెన్లు పొందిన వారికి వైద్యులు వైద్యసేవలు అందించారు. ఎంపీపీ ఈటిరాము, వైద్యాధికారి డాక్టర్ హుస్సేన్, మండల వైద్యాధికారులు డాక్టర్ షేక్ ఆసియా, డాక్టర్ ఆనంద్‌వర్ధన్ పాల్గొన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే మండలంలోని పుల్లగూరవాండ్లపల్లి గ్రామ సమీపంలోని హంద్రీనీవా కాలువను పరిశీలించారు. ప్రతి చెరువుకు నీరందిస్తామని అన్నారు.

గాండ్లపెంట: కటారుపల్లి గ్రామ సచివాలయంలో శనివారం నిర్వహించిన శిబిరంలో ఎమ్మెల్యే సిద్దారెడ్డి పాల్గొని వైద్య చికిత్సలపై ఆరా తీశారు. 260 మందికి పైగా పాల్గొని చికిత్సలు చేయించుకున్నారని, 20 మందికి పైగా ఉన్నత చికిత్సకు రెఫర్ చేసినట్లు వైద్యాధికారులు మహేశ్వరమారుతి, బాబాఫకృద్దీన్ ఎమ్మెల్యేకు తెలిపారు. స్పెషలిస్టు వైద్యులు డాక్టర్ సతీష్‌కుమార్, డాక్టర్ అనూరాధ, మండల ప్రత్యేకాధికారి మోహన్‌రామ్, ఎంపీపీ తాతం జగన్మోహన్, వైస్ ఎంపీపీ గంగోజమ్మ, కన్వీనర్ గజ్జలరవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

ముదిగుబ్బ: అడవిబ్రాహ్మణపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కంటి చూపు సరిగాలేని వారికి కళ్ల అద్దాలు పంపిణీ చేశారు. ఎంపీపీ ఆదినారాయణ, స్పెషలాఫీసర్ నరసింహమూర్తి పాల్గొన్నారు.

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం మారాలలో వైద్యులు రోగులకు వైద్యం అందించారు. ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, బాలం రమణారెడ్డి, ఆదినారాయణ, వెంకటచౌదరి పాల్గొన్నారు.

బత్తలపల్లి: అప్పరాచెరువులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు గంగిరెడ్డి, రామకృష్ణ, స్పెషలిస్టు డాక్టర్స్ గోపిక, సమీరారెడ్డి, వాసంతి ప్రజలకు వివిధ రోగాలపైన చికిత్సలు నిర్వహించి, మందులు ఉచితంగా పంపిణీ చేశారు. జిల్లా లెప్రసీ నియంత్రణ అధికారి డాక్టర్ తిప్పయ్య, ధర్మవరం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సెల్వియా పర్యవేక్షించారు. ఎంపీపీ త్రివేణి పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్: కుణుతూరు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 252 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. 65 మందికి కంటి పరీక్షలు, 57 మందికి ల్యాబ్ పరీక్షలు చేశామని వైద్యాధికారులు పుష్పలత, దిలీప్‌కుమార్ తెలిపారు. జెడ్పీ వైస్ చైర్మన్ కామిరెడ్డిపల్లి సుధాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ చిన్నక్రిష్టారెడ్డి, జిల్లా క్షయ నివారణ అధికారి తిప్పయ్య, డిప్యూటీ డిఎంహెచ్‌ఓ సాల్మన్, డీఎల్‌డీఓ శివారెడ్డి, మండల స్పెషలాఫీసర్ చాంద్‌బాషా పాల్గొన్నారు.

తాడిమర్రి: రాష్ట్ర ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని డీసీఎంఎస్ చైర్మెన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. పిన్నదరి గ్రామంలో శనివారం వైద్యాధికారులు నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డాక్టర్ క్రిష్ణప్రసాద్ 365 మందికి బీపీ, షుగర్, రక్త మూత్ర పరీక్షలు చేసి వైద్య చికిత్సలు అందించారు. ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి, వైటీ చంద్రశేఖర్‌రెడ్డి, పొరాళ్ల విజయ భాస్కర్‌రెడ్డి, ఆర్వేటి రామాంజినేయులు, అల్లే సాయినాథ్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి రామాంజినేయులు, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ విజయలక్ష్మి డాక్టర్లు జ్యోతిర్మయి, సల్మాన్ పాల్గొన్నారు.

600 మందికి చికిత్సలు

అమడగూరు: తుమ్మల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. 600 మందికి వైద్య పరీక్షలను నిర్వహించారు. ప్రత్యేకాధికారి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి, పుట్టపర్తి మున్సిపాలిటీ వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు శివశంకర్‌రెడ్డి, వైద్యాధికారులు మోనా, అపర్ణ పాల్గొన్నారు.

కొత్తచెరువు: బండ్లపల్లి గ్రామ సచివాలయం వద్ద శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. 272 మందికి వైద్యచికిత్సలు అందించడంతో పాటు కంటి పరీక్షలు నిర్వహించి అద్దాలను పంపిణీ చేశారు. ఆర్‌డీఓ భాగ్యరేఖ, ఎంపీపీ గాయత్రి, జెడ్పీటీసీ గంగాదేవి, డాక్టర్ మమత పాల్గొన్నారు.

కనగానపల్లి: యలకుంట్లలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ, మెడికల్ ఆఫీసర్ చెన్నారెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కళావతి, పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో వైద్యుడు ఉదయ్ వైద్య సేవలు అందజేశారు. ఎంపీపీ అంజలి, జెడ్పీటీసీ గోవిందరెడి, ప్రత్యేకాధికారి గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

నల్లమాడ: చారుపల్లి పంచాయితీ కేంద్రంలో 247 మందికి ఆరోగ్య సిబ్బంది వివిధ రకాల వైద్య సేవలు అందించారు. ఎంపీపీ దుంగావత్ సునీతాబాయి, ప్రత్యేకాధికారి మీనాక్షి, వైద్యాధికారి గణేనాయక్, డాక్టర్ హరికృష్ణ, ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ రోజారమణి, డాక్టర్ అసరున్నీసా, జగదీష్ పాల్గొన్నారు.

తనకల్లు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష మెగా వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. 800 మంది రోగులకు వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి మందులను అందజేశారు. వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ పాల్గొన్నారు.

నల్లచెరువు: కె.పూలకుంట గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరంలో 455 మందికి వైద్యులు చికిత్సను అందజేశారు. ఎంపీపీ రమణారెడ్డి, వైద్యాధికారులు అయిసుద్దీన్, నాగార్జునరెడ్డి, స్పెషల్ ఆఫీసర్ సూర్యనారాయణ, వైస్ ఎంపీపీ నారాయణస్వామి, మండల కన్వీనర్ బట్టీ హైదర్‌వలి, సర్పంచ్ యూసుఫ్, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, సీహెచ్‌ఓ రామచంద్రారెడ్డి,ఐసీడీఎస్ సీడీపీఓ గంగ రత్నమ్మ,జేసీఎస్ కన్వీనర్ రాజశేఖర్, మాజీ సర్పంచ్ అక్బర్,హెచ్‌పి సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ వైద్యం

• ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

అమడగూరు: ప్రతి పేదకూ కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమల్లోకి తెచ్చిందని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఓడిచెరువు మండలం కొండకమర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ శిబిరాల్లో గుండె సంబంధిత పరీక్షలు, బీపీ, షుగర్, థైరాయిడ్, కంటి పరీక్షలు, ఇతర జనరల్ పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. అనారోగ్యంతో పేదలు ఇబ్బందులు పడరాదనే ఉద్దేశంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్షను అమల్లోకి తెచ్చిందన్నారు. పైసా ఖర్చు లేకుండా ఖరీదైన వైద్యాన్ని ఉచితంగా పొందే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఆంధ్రప్రదేశ్‌ను ఆరోగ్యాంధ్ర ప్రదేశ్‌గా చేయాలన్నదే సీఎం జగనన్న ఆశయమన్నారు. ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మరోసారి అవకాశమిచ్చి సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. కాగా వైద్య శిబిరంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి వైద్య పరీక్షలు చేయించుకుని, రోగులు పరీక్షలు చేయించుకునేలా ప్రోత్సహించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి కృష్ణారెడ్డి, మార్కెట్‌యార్డ్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ పర్వీన్‌భాను, కన్వీనర్ రాజునాయుడు, జెడ్పీటీసీ దామోదర్‌రెడ్డి, టౌన్ కన్వీనర్ కోళ్ల క్రిష్ణారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆనంద్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి షామీర్ భాషా, అగ్రీ అడ్వైజరీ బోర్డు ప్రెసిడెంట్ లక్ష్మిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, సర్పంచ్, ఎంపీటీసీ, మహేశ్వర్‌రెడ్డి, వెంకటరంగారెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


తనకల్లులో వైద్య పరీక్షలు


నల్లచెరువు: పౌష్టికాహార పదార్థాలను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు


బత్తలపల్లి: అప్పరాచెరువులో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి గంగిరెడ్డి


కదిరిలో నిర్వహించిన వైద్య శిబిరానికి పోటెత్తిన ప్రజలు


వృద్ధులకు కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి


యలకుంట్ల గ్రామంలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

నేడు పింఛన్ల పంపిణీ

బత్తలపల్లి: ప్రతి నెలా వృద్ధులు, దివ్యాంగులు, వితంతు, ఒంటరి మహిళలకు అందజేస్తున్న సామాజిక పింఛన్ల సొమ్మును ఆదివారం సెలవు రోజు అయినా పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ సౌజన్య కుమారి తెలిపారు. శనివారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 6,449 మందికి వివిధ రకాల పింఛన్లు అందుతున్నట్లు తెలిపారు. వీటికి రూ.1,78,72,500 విడుదల అయినట్లు తెలిపారు.

ఏకవాక్య తీర్మానంతో అజెండా ఆమోదం

కదిరి: కదిరి మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు ఏక వాక్య తీర్మానంతో అజెండాలోని అంశాలన్నింటికీ ఆమోదం తెలిపారు. శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ పరికి నజీమున్నీసా అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశం జరిగింది. అజెండాలో ప్రవేశపెట్టిన 10 అంశాలనూ ఆమోదిస్తున్నామని కౌన్సిలర్ కిన్నెర కళ్యాణ్ పేర్కొనగా తోటి కౌన్సిలర్లు ముక్త కంఠంతో ఆమోదించారు. ఖాళీ జాగా పన్నులకు సంబంధించి జరుగుతున్న అవకతవకలను కౌన్సిలర్ ఎంఎస్ ఫయాజ్ కౌన్సిల్ దృష్టికి తెచ్చారు. మున్సిపల్ వాటర్ ట్యాంకులపై కౌన్సిలర్ రాజశేఖరాచారి మాట్లాడుతుండగా తోటి కౌన్సిలర్లు ఒక్కొక్కరూ లేచి ఇంటి ముఖం పట్టడంతో కౌన్సిల్ సమావేశాన్ని ముగిస్తున్నట్లు చైర్‌పర్సన్ ప్రకటించారు.

సీఎం జగనన్న చిత్రపటానికి క్షీరాభిషేకం


సీఎం జగనన్న చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వాహన మిత్రలు

గాండ్లపెంట: సామాలగొంది గ్రామంలో శనివారం ఆటో డ్రైవర్లు (వాహన మిత్రలు) సీఎం వైఎస్ జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఆటో డ్రైవర్లు మాట్లాడుతూ సీఎం తన పాదయాత్రలో ఆటో డ్రైవర్ల సమస్యలను గుర్తించి అధికారంలోకి రాగానే ఏటా రూ.10వేల ఆర్థిక సాయం చేశారని కొనియాడారు. సూర్యశేఖరనాయుడు, వెంకటరమణ, మేకల శివప్రసాద్, ప్రభాకరనాయుడు, చంద్ర, శ్రీరాములు,ప్రసాద్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీఎఫ్ కమిటీ ఎంపిక


ఎంపికైన వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు

పుట్టపర్తి: బుక్కపట్నం మండల వైఎస్సార్‌టీఎఫ్ కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. గౌరవాధ్యక్షుడిగా రామిరెడ్డి, అధ్యక్షునిగా శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మహేష్, కోశాధికారిగా రాజేష్, ఉపాధ్యక్షులుగా మహేశ్వర్‌రెడ్డి, వెంకటరాణెమ్మ, చంద్రమోహన్‌రెడ్డి, కార్యదర్శులుగా చంద్ర, రాధాకృష్ణ, సుకన్య, సుధాకర్, జిల్లా కౌన్సిలర్లుగా శ్రీనివాసరెడ్డి, రామాంజినేయులు, మధుసూదన్‌రెడ్డి, శంకర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు రమణారెడ్డి, ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు


ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

• ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: ప్రభుత్వం నవరత్నాల పేరుతో అందిస్తున్న సంక్షేమ పథకాలు పేదల జీవితాలలో వెలుగులు నింపుతున్నాయని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక 30వ వార్డులో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు జరిగిన లబ్ధిని వివరించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్లను సరిచేయాలని స్థానికులు కోరగా సమస్యను పరిష్కరించాలని ఏఈ కొండారెడ్డిని ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే కేతిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేసి పేదల మన్ననలు పొందిన ఏకైక సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని కొనియాడారు. పట్టణంలో ఏ సీజన్‌లో అయినా నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకున్నామన్నారు. సీసీరోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేశామన్నారు. సంక్షేమ ప్రభుత్వాన్ని ప్రజలందరూ ఆశీర్వదించాలన్నారు. అనంతరం సుందరయ్యనగర్‌లోని గణేష్ మున్సిపల్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల కొరత తీర్చాలని హెచ్‌ఎం కోరగా ఎమ్మెల్యే ఉన్నతాధికారులతో మాట్లాడారు. అనంతరం సచివాలయాన్ని తనిఖీ చేశారు. డీఈ వన్నూర్‌స్వామి, పట్టణ సచివాలయాల కన్వీనర్లు చందమూరి నారాయణరెడ్డి, కౌన్సిలర్లు రమాదేవి, బ్రహ్మయ్య. వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి అమర్‌నాథ్‌రెడ్డి, వార్డు ఇన్‌చార్జ్‌లు కోటిరెడ్డి బాలిరెడ్డి, రాయపాటి రామకృష్ణ, బాషా, తోపుదుర్తి వెంకటరాముడు, బడన్నపల్లి నర్సింహులు, బెస్త వెంకటరమణ, చందు, పరంధామిరెడ్డి, పెద్దిరెడ్డి శ్రీనివాసులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం

• మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి

ధర్మవరం: ధర్మవరం పట్టణంలో దీర్ఘకాలంగా నెలకొన్న ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు చేపట్టామని మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి పేర్కొన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లోని సమావేశ భవనంలో చైర్‌పర్సన్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. చైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారానికి సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటుకు చర్యలు చేపట్టామని ప్రకటించగా వైస్‌చైర్మన్లు వేముల జయరామిరెడ్డి, షంషాద్‌బేగం హర్షం వ్యక్తం చేశారు. కౌన్సిలర్లు గజ్జల శివ, పురుషోత్తంరెడ్డి, మేడాపురం వెంకటేశ్, కో ఆప్షన్ సభ్యుడు బూశెట్టి రామకృష్ణయ్య మాట్లాడుతూ వీధి లైట్లు పగలు కూడా వెలుగుతున్నాయన్నారు. ధర్మవరం–పుట్టపర్తి ప్రధాన రహదారి సమీపంలో ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం అజెండాలోని అంశాలు చర్చించి సభ్యులు ఆమోదించారు. మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, డీఈ వన్నూర్‌స్వామి పాల్గొన్నారు.

ఆయా పోస్టులకు 33 మంది దరఖాస్తు

చెన్నేకొత్తపల్లి: ఐసీడీఎస్ చెన్నేకొత్తపల్లి సెక్టారు పరిధిలోని రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాల్లో ఖాళీగా ఉన్న 8 పోస్టులకు 33 మంది దరఖాస్తు చేసుకున్నట్లు సీడీపీఓ కవితాదేవి తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

ప్రశాంతి నిలయం: 6వ వార్డులో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే నిర్వహించారు. ఎఎన్‌ఎంలు, ఆశావర్కర్లు ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి టోకెన్‌లు అందజేశారు. వైస్ చైర్మన్ శ్రీలక్ష్మి నారాయణరెడ్డి, మాజీ కౌన్సిలర్ నారాయణరెడ్డి, పట్టణ కన్వీనర్ రంగారెడ్డి పాల్గొన్నారు.

విత్తన కిట్లు అందజేత

ముదిగుబ్బ: సానేవారిపల్లిలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న 13 మంది దళిత రైతులకు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సారయ్య శనివారం విత్తన కిట్లు అందజేశారు. సర్పంచ్‌లు శ్రీదేవి, రమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనాథ్‌గౌడ్ పాల్గొన్నారు.

రామగిరి ఎంపీపీ సుజాత రాజీనామా

రాప్తాడురూరల్: రామగిరి ఎంపీపీ ఎనమల సుజాత తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు శనివారం అనంతపురంలో జాయింట్ కలెక్టర్, జెడ్పీ సీఈఓ కేతన్‌గార్గ్‌ను కలిసి రాజీనామా పత్రాన్ని అందించారు. వ్యక్తిగత కారణాలతో పదవికి రాజీనామా చేశానని, ఎంపీటీసీ సభ్యురాలిగా కొనసాగుతానని సుజాత స్పష్టం చేశారు.

సంక్షిప్త సమాచారం

జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

నల్లచెరువు: ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో కదిరి బ్లూమూన్ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల అధినేత శివశంకర్ తెలిపారు. దీక్షిత రెడ్డి, వర్షారెడ్డి, జ్యోత్స్న శ్రీజ, రోహిత్ రెడ్డి, మోక్షజ్ఞతేజ, గౌతమ్, ప్రదీప్, చైతన్య నాయక్, విష్ణు, హేమంత్, వినిత్, పూర్ణిమ, జ్యోత్స్న, మానస ఎంపికయ్యారని తెలిపారు.

'పల్లెవెలుగు'లో ప్రయాణిస్తే బహుమతులు

పుట్టపర్తి టౌన్: పల్లెవెలుగు బస్సుల్లో ప్రయాణించి బహుమతులు గెలుపొందాలని డిపో మేనేజర్ ఇనయతుల్లా పేర్కొన్నారు. ముదిగుబ్బ రూట్ బస్సుల్లో ప్రయాణించేవారు టికెట్ వెనుక పూర్తి పేరు, సెల్ నంబర్ రాసి బస్సులో డ్రైవర్ వెనుక భాగంలో అమర్చిన గిఫ్ట్ బాక్స్‌లో వేయాలన్నారు. ప్రతి నెల 30న లాటరీ తీసి బహుమతి అందజేస్తామన్నారు.

కామాంధులను శిక్షించాలి

కొత్తచెరువు: చిత్తూరు జిల్లాలో ఇంటర్ విద్యార్థిని భవ్యశ్రీ మృతికి కారణమైన వారిని శిక్షించాలని వడ్డెర్లు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం రాత్రి కొత్తచెరువులోని వడ్డెర్లు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.

వెల్లివిరిసిన మానవత్వం


అంత్యక్రియలు నిర్వహిస్తున్నర దృశ్యం

కదిరి అర్బన్: మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లిలో అనాథశవానికి శనివారం వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మణికంఠనాయక్, ఉప సర్పంచ్ గంగిరెడ్డి మానవతాదృక్పథంతో అంత్యక్రియలు నిర్వహించారు. రక్త సంబంధీకులు ఎవరూ రాకపోవడంతో తమస్వంత ఖర్చుతో అంత్యక్రియలు నిర్వహించారు.

భక్తులతో శ్రీఖాద్రీ ఆలయం కిటకిట

కదిరి టౌన్: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి విశేష అలంకరణలు, విశేష పూజలు నిర్వహించారు. కదిరితోపాటు వివిధ జిల్లాలనుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి శ్రీఖాద్రీశుని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి, అన్నదానం నిర్వహించారు.

మద్దిలేరు వాగు పరిశీలన


మద్దిలేరువాగును పరిశీలిస్తున్న ఇంజనీర్ ఇన్ చీఫ్ బాలూనాయక్

కదిరి అర్బన్: పట్నం పంచాయతీలో రాచువారిపల్లితండాకు వెళ్లేదారిలో మద్దిలేరు వాగును శనివారం పంచాయతీ రాజ్ శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ బాలూనాయక్ పరిశీలించారు. వర్షాకాలంలో వాగు ప్రవహించే సమయంలో నీటి ఉధృతి ఉన్న సమయంలో రాకపోకలకు ఆటంకం ఏర్పడుతోంది. దీంతో మద్దిలేరు వాగుపై వంతెన నిర్మించాలని గతంలో గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే స్పందించి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. హై ఇంపాక్ట్ రోడ్స్ కింద బ్రిడ్జి నిర్మాణానికి రూ.7 కోట్లు ఖర్చు అవుతుందని అధికారులు అంచనా వేశారు. ఈ క్రమంలో ఇంజనీర్ ఇన్ చీఫ్‌తో పాటు ఎస్ఈ భాగ్యరాజ్, ఈఈ శ్రీనివాసులు, డీఈ హనుమంతరాయశెట్టి శనివారం వాగును పరిశీలించారు. సర్పంచ్ చలపతినాయక్, వైస్ ఎంపీపీ ఆనంద్‌నాయక్ పాల్గొన్నారు.